# ప్రభాత ఉదయం

తెలుగు దినపత్రిక

సంపుటి: 2 | సంచిక: 107 | పేజీలు: 4 | వెల: రూ.3/- | శనివారం 27 జులై 2024 | ఎడిటర్: కోట్ల చంద్రకాంత్





## పెట్రోల్, డీజిల్ ధరల తగ్గింపుపై నిర్మలమ్మ కీలక వ్యాఖ్యలు

జీఎస్టీ కౌన్సిల్‌లో నిర్ణయం

2లో..

# చరిత్ర నుంచి పాకిస్థాన్ గుణపాఠం నేర్చుకోలేదు

- ఉగ్రవాదాన్ని ఉపేక్షించేది లేదు
- మా దళాలు శత్రువులకు తగిన జవాబిస్తాయి
- కార్గిల్ గడ్డ నుంచి పాక్‌కు మోదీ స్ట్రాంగ్ వార్నింగ్
- కార్గిల్ యుద్ధ వీరులకు ప్రధాని మోదీ ఘన నివాళి



న్యూఢిల్లీ, జులై 26 (ప్రభాత ఉదయం): చరిత్ర నుంచి పాకిస్థాన్ ఎలాంటి గుణపాఠం నేర్చుకోలేదని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఉగ్రవాదాన్ని సమూలంగా పెకిలిస్తామని దాయాది దేశాన్ని మరోసారి గట్టిగా హెచ్చరించారు. కార్గిల్ 25వ విజయ దివస్‌ను పురస్కరించుకుని ద్రాస్‌లోని యుద్ధ స్మారకాన్ని సందర్శించి అమర జవాన్లకు నివాళులర్పించారు. అనంతరం ఆనాటి యుద్ధంలో అమరులు అయిన కుటుంబాలతో ప్రధాని ముచ్చటించారు. తర్వాత షిన్‌కున్ లా సొరంగ పనుల ప్రాజక్టును ప్రధాని వర్చువల్‌గా ప్రారంభించారు. అనంతరం మాట్లాడిన ప్రధాని మన బలానికి, సహనానికి, వాస్తవాలకు ఈ విజయగాథ నిదర్శమన్నారు. దేశం కోసం ప్రాణాలు పణంగా పెట్టిన సైనికులు చిరకాలం గుర్తుండిపోతారని ప్రధాని అన్నారు. శాంతి కోసం భారత్ తపిస్తే పాకిస్థాన్ తన నిజ స్వభావాన్ని చూపిందని దుయ్యబట్టారు. కార్గిల్‌లో యుద్ధం మాత్రమే గెలవలేదని భారత్ సత్తా, సామర్థ్యాన్ని చాటామని చెప్పారు. "గతంలో పాకిస్థాన్ పాల్పడిన వికృత ప్రయత్నాలు విఫలమయ్యాయి. అయినా, చరిత్ర నుంచి ఆ దేశం ఎలాంటి గుణపాఠాలు నేర్చుకోలేదు సరికదా! ఉగ్రవాదం, ప్రాక్సీ వార్‌తో ఇంకా మనపై కవ్వింపు చర్యలకు పాల్పడుతూనే ఉంది. ఈ రోజు నేను మాట్లాడే మాటలు ఉగ్రవాదులను తయారుచేస్తున్న వారికి (పాక్ సైన్యాన్ని ఉద్దేశిస్తూ) నేరుగా

..మిగతా 2లో



# మరోసారి ఎన్నికల పండుగ



### సెప్టెంబర్ లేదా అక్టోబర్‌లో సర్పంచ్ ఎన్నికలు
### పాత రిజర్వేషన్లే అమలు చేయాలని యోచన
### సీఎం రేవంత్ రెడ్డి కీలక నిర్ణయం



హైదరాబాద్, జులై 26 (ప్రభాత ఉదయం): తెలంగాణలో మరో ఎన్నికల పర్వానికి త్వరలోనే నగారా మోగనుంది. గత డిసెంబర్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగ్గా.. ఈ ఏడాది మేలో పార్లమెంట్ ఎన్నికలు జరిగాయి. అయితే.. ఇప్పుడు అందరి దృష్టి సర్పంచ్, స్థానిక సంస్థల ఎన్నికలపై పడింది. ఈ నేపథ్యం లోనే.. సచివాలయంలో పంచాయతీ రాజ్ శాఖపై సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో.. సర్పంచ్, స్థానిక సంస్థల ఎన్నికలపై మంత్రులు భట్టి విక్రమార్క, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీతక్క, పొన్నం ప్రభాకర్‌తో కలిసి సమీక్షించారు. సెప్టెంబర్ లేదా అక్టోబర్ నెలలో సర్పంచ్ ఎన్నికలు నిర్వహించనున్నట్టు సీఎం రేవంత్ రెడ్డి తెలిపినట్టు సమాచారం. అయితే.. ఇప్పటికే సర్పంచుల పదవీకాలం ముగిసి ఆరు నెలలు కావస్తున్న నేపథ్యంలో.. రిజర్వేషన్లలో ఎలాంటి మార్పు లేకుండా గత రిజర్వేషన్లలే కొనసాగించాలని నిర్ణయించినట్టు తెలుస్తోంది. కొత్త ఓటరు జాబితాను ఆగస్టు మొదటివారంలోగా

..మిగతా 2లో

# ఎల్ఆర్ఎస్ కొత్త విధివిధానాలు

### అమలుపై డిప్యూటీ సీఎం భట్టి సమీక్ష

ఎల్ఆర్ఎస్ విధివిధానాల కసరత్తుపై సమీక్ష

జిల్లాల వారిగా బృందాలు ఏర్పాటు చేయాలని ఆదేశాలు



హైదరాబాద్, జులై 26 (ప్రభాత ఉదయం): తెలంగాణలో గత ప్రభుత్వం తీసుకొచ్చిన "లేఅవుట్ క్రమబద్ధీకరణ పథకం" అమలుపై రేవంత్ రెడ్డి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఎల్ఆర్ఎస్ వల్ల ప్రజలపై తీవ్ర భారం పడనుందంటూ ప్రతిపక్షంలో ఉన్న సమయంలో విమర్శించిన కాంగ్రెస్ పార్టీ.. ఇప్పుడు అధికారంలోకి వచ్చిన తర్వాత కొత్త విధివిధానాలు తీసుకురావాలని యోచిస్తోంది. ఈ మేరకు.. ఎల్ఆర్ఎస్ అమలుపై సచివాయలంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సమీక్ష నిర్వహించారు. ఎల్ఆర్ఎస్ విధివిధానాల కసరత్తుపై సమీక్షించారు. ఎల్ఆర్ఎస్ అమలు కోసం కొత్త జిల్లాల వారీగా బృందాలు ఏర్పాటు చేయాలని అధికారులకు భట్టి విక్రమార్క కీలక ఆదేశాలు జారీ చేశారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఈ ఎల్ఆర్ఎస్‌ను పకడ్బందీగా అమలు చేయాలని భట్టి విక్రమార్క అధికారులు సూచించారు. ఈ ఎల్ఆర్ఎస్‌కు సంబంధించి రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే 39 లక్షల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని.. వీలైనంత వేగంగా పరిష్కరించాలని అధికారులకు భట్టి సూచించారు. జిల్లాల వారీగా ప్రత్యేక బృందాలు

..మిగతా 2లో

# ఆగస్టు 2 డెడ్‌లైన్

### 50 వేల మంది రైతులతో వచ్చి పంపులు ఆన్ చేస్తాం

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



హైదరాబాద్, జులై 26 (ప్రభాత ఉదయం): అగస్టు 2వ తేదీలోపు కన్నెపల్లి పంప్‌హౌజ్‌లు ప్రారంభించకపోతే.. 50 వేల మంది రైతులతో వచ్చి పంపులు ఆన్ చేస్తాం అని తెలంగాణ ప్రభుత్వాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హెచ్చరించారు. తెలంగాణకు కాళేశ్వరం ప్రాజెక్ట్ ఓ గుండె లాంటిందని, రాష్ట్రంలో కరువు అనే మాట వినపడకుండా ముందు చూపుతో కేసీఆర్ కాళేశ్వరం నిర్మించారన్నారు. కాళేశ్వరాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోలేదని, చిన్న సమస్య తలెత్తితే ప్రాజెక్ట్‌పై విష ప్రచారం చేస్తున్నారని కేటీఆర్ అన్నారు. కేటీఆర్ నేతృత్వంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల బృందం కాళేశ్వరం పర్యటనకు వెళ్లింది. ఈ పర్యటనలో భాగంగా ముందుగా కన్నెపల్లి పంప్‌హౌజ్ వద్ద పరిస్థితులను పర్యవేక్షించారు. కన్నెపల్లి పంప్‌హౌజ్ వద్ద కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ 'స్వతంత్ర భారతదేశంలో ఏ ప్రభుత్వం చేయనంత గొప్పగా ముందు చూపుతో కాళేశ్వరంను కేసీఆర్ నిర్మించారు. బహుళార్థ ప్రయోజనాల లక్ష్యంతో కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మాణం జరిగింది. అత్యంత ఎత్తైన 618 అడుగుల కొండపోచమ్మ సాగర్ వరకు నీరు వెళ్లే విధంగా డిజైన్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ తెలంగాణకు కామధేనువు లాంటిది. ఎగువ గోదావరి నుంచి దిగువన ఉన్న కాళేశ్వరం వరకు పరిశీలించాము. కరవు పీడిత ప్రాంతాల కోసం కాళేశ్వరం కట్టాము. కన్నెపల్లి నుంచి

..మిగతా 2లో

# ధరణిపై మరింత లోతుగా అధ్యయనం

### సీఎం రేవంత్ రెడ్డి



హైదరాబాద్, జులై 26 (ప్రభాత ఉదయం): ధరణి సమస్యల పరిష్కారమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టి సారించింది. ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డి సచివాలయంలో మంత్రులతో ధరణి సమస్యలు, పలు శాఖలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ధరణిపై మరింత లోతుగా అధ్యయనం చేసిన తర్వాతే శాశ్వత పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సీఎం సూచించారు. ధరణి సమస్యలకు శాశ్వత పరిష్కారం కోసం మరింత లోతుగా అధ్యయనం జరగాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. భూ సమస్యలు రోజురోజుకీ మరింత ఎక్కువవుతున్నందున సమగ్ర చట్టం తయారు చేయాల్సిన అవసరం ఉందన్నారు. పైలట్ ప్రాజెక్టుగా ఒక మండలంలో భూసమస్యలని

..మిగతా 2లో




2

## మోదీ 3.0లో తొలి నీతి ఆయోగ్ సమావేశం

కాంగ్రెస్ సీఎంల డుమ్మా

# జూరాలకు తగ్గని వరద ప్రవాహం



గద్వాల జిల్లా ప్రతినిధి, జూలై 26(ప్రభాత ఉదయం)ఉమ్మడి పాలమూరు జిల్లా వరప్రదాయమైన ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు వరద ప్రవాహం కొనసాగుతోంది. జూరాల ప్రాజెక్టు ఎగువన ఉన్న ఆల్మట్టి, నారాయణపూర్ డ్యాం నుండి జూరాలకు 2,65,000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదు కాగ శుక్రవారం జూరాల జలాశయంలో పూర్తి స్థాయి నీటి నిల్వలు 9.657 టీఎంసీలకు గాను ప్రస్తుతం 6.841 టీఎంసిల నీరు నిల్వ ఉంది. ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద నీటిని అంచనా వేస్తూ ప్రాజెక్టు 36 గేట్ల ద్వారా దిగువకు 2.30లక్షల క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. జూరాల ప్రాజెక్టు మీద ఆధారపడిన కోయిల్ సాగర్, బీమా, నెట్టెంపాడు తదితర ప్రాజెక్టులకు సాగునీటి అవసరాల కోసం నీరు విడుదల చేశారు.

# ధరణిపై మరింత లోతుగా అధ్యయనం



మొదటి పేజీ తరువాయి...

అధ్యయనం చేయాలని సూచించారు. అవసరమైతే శాసనసభలో చర్చించి తుది నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు.

ధరణి సమస్యలపై సీఎం సమీక్ష : ధరణి సమస్యలు, పరిష్కార మార్గాలపై సచివాలయంలో సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన సమావేశం జరిగింది. ఒకప్పుడు గ్రామ స్థాయిలోనే అందుబాటులో ఉండే రికార్డులు చట్టాల మార్పుతో క్రమంగా జిల్లా కేంద్రం, రాష్ట్ర స్థాయికి వెళ్లిపోయాయన్నారు. గతంలో భూ సమస్యల పరిష్కారానికి అప్పీలు చేసుకునే అవకాశం ఉండేదని గుర్తు చేశారు. ధరణితో గ్రామ, మండల స్థాయిలో ఏ సమస్యకూ పరిష్కారం లేకుండా పోయిందని, అన్ని అధికారాలు జిల్లా కలెక్టర్ కు అప్పజెప్పారన్నారు. కలెక్టర్ల వద్ద కూడా సమస్యలు పరిష్కారం కావడం లేదన్న సీఎం కలెక్టర్ల నిర్ణయాన్ని ప్రశ్నించే అవకాశం లేకుండా ధరణిని రూపొందించారన్నారు. భూ సమస్యల పరిష్కారానికి విస్తృతస్థాయి సంప్రదింపులు జరపాలని, ప్రజల నుంచి సూచనలు స్వీకరించాలని రేవంత్ రెడ్డి తెలిపారు. అఖిలపక్ష సమావేశం కూడా నిర్వహించి అందరి అభిప్రాయాలతో సమగ్ర చట్టం తీసుకురావల్సి ఉందన్నారు.

ధరణిపై మరింత లోతుగా అధ్యయనం చేయండి : భూదాన్, పొరంబోకు, బంచరాయి, ఇనాం, కాందిశీకుల భూముల సమస్యలున్న ఓ మండలాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి అధ్యయనం చేస్తే స్పష్టత వస్తుందని సీఎం సూచించారు. అవసరమైతే ధరణికి సంబంధించిన అన్ని అంశాలపై శాసనసభలో చర్చించి తుది నిర్ణయం తీసుకుంటామని రేవంత్ రెడ్డి వెల్లడించారు. సమావేశంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, మంత్రి సీతక్క, పొన్నం ప్రభాకర్, సలహాదారులు కేశవరావు, వేం నరేందర్ రెడ్డి, మాజీ మంత్రి జానా రెడ్డి, ధరణి కమిటీ సభ్యులు కోదండరెడ్డి, సునీల్ కుమార్, రేమండ్ పీటర్, మధుసూదన్, సీసీఎల్ఏ నవీన్ మిత్తల్, సీఎస్ శాంతి కుమారి, సీఎంవో అధికారులు పాల్గొన్నారు. సచివాలయంలో పంచాయతీ రాజ్ శాఖపై సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఆ శాఖకు సంబంధించిన పలు అంశాలపై సమీక్షించారు. పంచాయతీ ఎన్నికల కార్యాచరణపై డిప్యూటీ సీఎం, ఇతర మంత్రులతో సీఎం చర్చించారు. ఈ సమీక్షలో సీఎస్, డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు పొంగులేటి, సీతక్క పాల్గొన్నారు.



# ఆగస్టు 2 డెడ్‌లైన్

మొదటి పేజీ తరువాయి...

నీటిని లిఫ్ట్ చేయవచ్చా అధికారులను అడిగి తెలుసుకున్నాం. కాళేశ్వరం విషయంలో రాజకీయాలు చేయకండి అని గతంలో ప్రభుత్వానికి చెప్పాము. అన్నారంలో గ్రౌటింగ్ చేశారా అని మేము ఇంజనీర్లను ఆడిగాము. రెగ్యులర్‌గా గ్రౌటింగ్ జరుగుతుంది. ఎన్డీఎస్ఏ చెప్తేనో కాదు.. రెగ్యులర్‌గా గ్రౌటింగ్ చేస్తామన్నారు. రోజుకు మూడు టీఎంసీల నీటిని ఎత్తి పోసుకోవచ్చు. నీరు ఉంది కానీ లిఫ్ట్ చేసేందుకు రాజకీయ సంకల్పం లేకపోవడం వల్ల జరగడం లేదు' అని అన్నారు. 'ఇంజనీర్‌లతో మాట్లాడిన తర్వాత మాకు ఒకటి అర్థమైంది. కేసీఆర్‌ని బద్నామ్ చేసేందుకు ఈ ప్రభుత్వం ఇదంతా చేస్తుంది. ఇక్కడ నుంచి లిఫ్టింగ్ ప్రారంభిస్తే 18 లక్షల ఎకరాలకు నీరు ఇవ్వవచ్చు. ఆరు నెలలు రాజకీయం చేద్దాం.. నాలుగున్నర ఏళ్ళు ప్రజల కోసం పని చేద్దాం. పంపులు ప్రారంభించండి రాజకీయాలు మానండి. పంపులు ప్రారంభిస్తారా లేదా?. అసెంబ్లీ సమావేశాలు ముగిసేవరకు గడువునిస్తున్నాం. అగస్టు 2వ తేదీలోపు పంపులు ప్రారంభించకపోతే.. 50 వేల మంది రైతులతో వచ్చి పంపులు ఆన్ చేస్తాం. ప్రభుత్వం స్పందించకపోతే మేమే వచ్చి పంప్ హౌజ్ లను ఆన్ చేస్తాం. ఉద్దేశ్య పూర్వకంగా, నెరపూరిత నిర్లక్ష్యంగా ప్రభుత్వం వ్యవహరిస్తోంది. 100 భాగాలు ఉన్న ప్రాజెక్ట్ లో చిన్న భాగంలో సమస్య వస్తే రాద్ధాంతం చేస్తున్నారు. ఎన్డీఎస్ఏ సూచనల మేరకే అన్నారంలో నీరు నింపడం లేదని అనడం అబద్ధం. గ్రౌటింగ్ అనేది రెగ్యులర్ ప్రాసెస్. నీళ్లు నింపితే కాంగ్రెస్ పార్టీ మాటలు అబద్ధం అని తేలుతుందని తేలుకుట్టిన దొంగల్లా వ్యవహరిస్తున్నారు. ఎన్డీఎస్ఏ కాళేశ్వరం రాలేదు. రాకుండానే రిపోర్టు ఇచ్చింది. కేంద్రంలో ఉన్న బీజేపీ, రాష్ట్రంలో కాంగ్రెస్ కలిసి తప్పుడు రిపోట్లులు ఇచ్చేలా చేశారు. పోలవరం కొట్టుకుపోతే ఇప్పటి వరకు ఎన్డీఎస్ఏ రిపోర్ట్ ఇవ్వలేదు. కాళేశ్వరంలో మాత్రం ఒక్కరోజులో ఇచ్చారు' అని కేటీఆర్ చెప్పుకొచ్చారు

# మరోసారి ఎన్నికల పండుగ

మొదటి పేజీ తరువాయి...

పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలిచ్చారు. ఓటరు జాబితా పూర్తయిన వెంటనే నిర్దిష్ట గడువులోగా రిపోర్ట్ ఇవ్వాలని బీసీ కమిషన్ కు సూచించారు. బీసీ కమిషన్ రిపోర్ట్ ఆధారంగా పంచాయతీ ఎన్నికల నిర్వహణపై నిర్ణయం తీసుకోనున్నట్టు సమాచారం. వీలైనంత త్వరగా ఎన్నికల నిర్వహణకు అవసరమైన ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులను రేవంత్ రెడ్డి ఆదేశించారు. గతంలోనూ.. సర్పంచ్ ఎన్నికలపై స్పందించిన సీఎం రేవంత్ రెడ్డి.. మహబూబ్ నగర్‌లో నిర్వహించిన సభలో కీలక వ్యాఖ్యలు చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఆగస్టు 15 లోపు రైతులకు 2 లక్షల మేర రుణమాఫీ చేసి తీరుతామన్న సీఎం రేవంత్ రెడ్డి.. ఆ ప్రక్రియ పూర్తయిన తర్వాతే.. సర్పంచ్ ఎన్నికలకు పోదామని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో.. రుణమాఫీని ఆగస్టు 15 లోపల పూర్తి చేసి.. సెప్టెంబర్ లేదా అక్టోబర్‌లో సర్పంచ్ ఎన్నికలకు నగారా మోగించే అవకాశం ఉంది. ప్రస్తుతం రాష్ట్రంలో.. సర్పంచులు, ఎంపీటీసీ, జడ్పీటీసీల పదవి కాలం ముగిసిన విషయం తెలిసిందే. కాగా.. త్వరలోనే సర్పంచ్, స్థానిక సంస్థల ఎన్నికలపై కీలక ప్రకటన చేయటంతో.. రాష్ట్రంలో మరోసారి ఎన్నికల పండుగ షురూ కానుంది. అది కూడా తెలంగాణలో అదిపెద్ద పండుగ అయిన బతుకమ్మ, దసరా సమయంలోనే వస్తుండటంతో.. రాష్ట్రంలో సందడి వాతావరణం నెలకొననుంది. మరోవైపు.. రుణమాఫీ చేసిన తర్వాతే సర్పంచ్ ఎన్నికలకు పోవాలనుకోవటంపై పెద్ద వ్యూహమే ఉందని విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు. రుణమాఫీ పూర్తిచేసి.. ఇచ్చిన మాట నిలబెట్టుకున్నామని చెప్తూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రచారం చేసుకునే అవకాశం ఉందని చెప్తున్నారు. ఇదే జరిగితే.. గ్రామాల్లో ఓట్లన్ని కాంగ్రెస్‌కే పడతాయని రేవంత్ రెడ్డి మాస్టర్ ప్లాన్ వేసినట్టు అంచనా వేస్తున్నారు. మరి దీనిపై సీఎం రేవంత్ రెడ్డి క్లారిటీ ఇవ్వాల్సి ఉంది.

# ఎల్ఆర్ఎస్ కొత్త విధివిధానాలు

మొదటి పేజీ తరువాయి...

ఏర్పాటు చేయాలని.. సిబ్బంది కొరత ఉంటే ఇతర శాఖల నుంచి డిప్యుటేషన్‌పై తీసుకోవాలని భట్టి సూచించారు. సమావేశంలో ఆర్థిక శాఖ ప్రత్యేక కార్యదర్శి రామకృష్ణారావు, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి, రెవెన్యూ శాఖ ముఖ్యకార్యదర్శి నవీన్ మిత్తల్, రిజిస్ట్రేషన్ల శాఖ ముఖ్యకార్యదర్శి జ్యోతి బుద్ధ ప్రకాష్, గృహనిర్మాణ శాఖ ప్రత్యేక కార్యదర్శి వీపీ గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

# మందుబాబులకు బ్యాడ్ న్యూస్

## రెండ్రోజులు వైన్స్ షాపులు బంద్

హైదరాబాద్, జులై 26 (ప్రభాత ఉదయం): మందుబాబులకు బ్యాడ్ న్యూస్. వీకెండ్‌లో మందు పార్టీలతో మజా చేయాలనుకునే వారికి సిటీ పోలీసులు బ్రేకింగ్ న్యూస్ చెప్పేశారు. ఆది, సోమవారాలు రెండ్రోజుల పాటు సిటీలో మద్యం అమ్మకాలు జరపకూడదని ఆదేశించారు. వాస్తవానికి ఈ రోజుల్లో ఏ ఫంక్షన్ అయినా ముక్క, సుక్క ఉండాల్సిందే. సుక్క లేకుండా దాదాపు ప్రస్తుతం ఏ వేడుక జరగడం లేదు. వీకెండ్స్, పండగ రోజుల్లో అయితే అన్ని ప్రాంతాల్లో మద్యం ఏరులై పారుతుంది. ఇక కొందరికి అయితే చుక్క పొట్టలోకి పోకపోతే పూట గడవని పరిస్థితి ఉంటుంది. ఎప్పుడెప్పుడు లిక్కర్ షాపులు ఓపెన్ చేస్తారా అని ఎదురు చూసుకుంటూ కూర్చుంటారు. బాధొచ్చినా.. సంతోషం వచ్చినా మందుతో సెలబ్రేట్ చేసుకోవాల్సిందే అన్నట్లు తయారయ్యారు ఈ రోజుల్లో జనాలు. ఒక్కరోజు మద్యం షాపులు మూసినా జనాలు విలవిల్లాడిపోతుంటారు. ఇలాంటి వారికి మద్యం షాపులు రెండు రోజుల పాటు బంద్ అవుతున్నాయంటే ఎంతటి బాధ ఉంటుందో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. అసలు వైన్స్ షాపులు ఏ కారణంతో బంద్ కానున్నాయో తెలుసుకుందాం.

### ఘనంగా బోనాలు

ప్రస్తుతం ఆషాఢ మాసం నడుస్తోంది. దీంతో హైదరాబాద్ లో బోనాల వేడుకలు వైభవంగా జరుగుతున్న సంగతి తెలిసిందే. భక్తి శ్రద్ధలతో అమ్మ వార్లకు బోనాలు సమర్పించి కొలుస్తుంటారు భక్తులు. అత్యంత వైభవంగా జరుపుకుంటున్న బోనాల పండుగ నేపథ్యంలో ఎలాంటి అల్లర్లు, అవకతవకలు చోటు చేసుకోకుండా ముందస్తు చర్యల్లో భాగంగా అధికారులు వైన్సులు మూసి వేయాలని నిర్ణయించారు. మహంకాళీ బోనాల పండుగ ను దృష్టిలో ఉంచుకుని హైదరాబాద్ అంతటా.. నాన్ ప్రొప్రయిటరీ క్లబ్ లు, స్టార్ హెూటళ్లు, రెస్టారెంట్ లతో సహా అన్ని వైన్స్ షాపులు మూసివేయనున్నట్లు సీపీ కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి చెప్పారు. ఎల్లుండి అంటే జూలై 28 ఉదయం 6 గంటల నుంచి రెండు రోజుల పాటు వైన్స్ షాపులన్నీ మూసివేయబడతాయి.

### ఆరు గంటల నుంచే బంద్

సౌత్ ఈస్ట్ జోన్‌లో చాంద్రాయణగుట్ట , బండ్లగూడ వంటి ప్రాంతాల్లో ఆదివారం ఉదయం 6 గంటలనుంచి 24 గంటల వరకు మద్యం దుకాణాలు మూసివేయబడతాయి. సౌత్ జోన్‌లో చార్మినార్, కమాటిపుర, హుస్సేనీ ఆలం, ఫలక్‌నుమా, మొఘల్‌పురా, చైటినాక, షాలి బండ , మీర్‌చౌక్ ప్రాంతాల్లో జూలై 28 ఉదయం 6 గంటలనుంచి రెండు రోజుల పాటు కల్లు, వైన్స్ షాపులు, హెూటళ్లు, రెస్టారెంట్లు , క్లబ్బులు, మద్యం విక్రయించే లేదా సరఫరా చేసే ఇతర సంస్థలు మూసివేయబడతాయని సీపీ కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. రెండు రోజుల పాటు లిక్కర్ దుకాణాలు మూతపడనుండడంతో మద్యం ప్రియులు ఉసూరుమంటున్నారు. ఇటీవల పలు పండగల నేపథ్యంలో వైన్సులు మూసి వేస్తుండడంతో మద్యం ప్రియులు నిరాశ చెందుతున్నారు.

### చర్యలు తప్పవు

డ్రై డేలో లిక్కర్ కొనుగోలు చేస్తే పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటారు. ఈ రెండు రోజులు కూడా ఇదే తరహా నిబంధనలను అమలు చేయనున్నారు. మహంకాళి లాల్ దర్వాజ బోనాల వేడుకల సందర్భంగా అంబారీ పై అమ్మవారి ఊరేగింపు వేడుకలు జరగనున్నాయి. పాత బస్తీలోని పలు ప్రాంతాల మీదుగా ఈ యాత్ర కొనసాగుతుంది. ఆయా రూట్లలో వాహనాలను కూడా మళ్లించనున్నారు. ఇప్పటికే ఆదేశాలు జారీ అయ్యాయి.



# స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై సీఎస్ సమీక్ష

హైదరాబాద్, జులై 26 (ప్రభాత ఉదయం): స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి శుక్రవారం డాక్టర్.బి.ఆర్.అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. అధికారులందరూ సమన్వయంతో పనిచేసి వేడుకలకు ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని సీఎస్ ఆదేశించారు. గోల్కొండ కోటలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు నిర్వహించనున్నట్లు సీఎస్ తెలిపారు. ముందుగా ముఖ్యమంత్రి పరేడ్ గ్రౌండ్‌లోని సైనిక అమరవీరుల స్మారక స్థూపం వద్ద నివాళులు అర్పించి.. తర్వాత గోల్కొండ కోటలో జాతీయ పతాకాన్ని ఎగురవేస్తారని ఆమె వెల్లడించారు. వేడుకల సందర్భంగా అసెంబ్లీ, కౌన్సిల్, హైకోర్టు, రాజ్‌భవన్, సెక్రటేరియట్ భవనాలను విద్యుత్ దీపాలతో అలంకరించాలని సంబంధిత అధికారులను సీఎస్ ఆదేశించారు. జాతీయ పతాకం ఎగురవేసే ప్రధాన వేదిక వద్ద తగిన ఏర్పాట్లు చేయాలని ఆర్ అండ్ బీ శాఖను సీఎస్ కోరారు. ముఖ్యమంత్రి ప్రసంగిస్తున్న సమయంలో ఆయనను అతిథులు అందరూ చూసేందుకు వీలుగా ప్రధాన వేదిక ఏర్పాట్లు ఉండాలన్నారు. వేడుకలు నిర్వహించే పరిసర ప్రాంతాలలో తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని, ఎప్పటికప్పుడు చెత్తను శుభ్రం చేస్తూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం వంటి పారిశుద్ధ్య పనులలో ఎలాంటి లోపాలు ఉండరాదని పురపాలక శాఖను ఆదేశించారు. అంబులెన్స్, నర్సింగ్ అసిస్టెంట్లను అందుబాటులో ఉంచాలని ఆరోగ్యశాఖ అధికారులకు సూచించారు. ప్రముఖులకు, అధికారులకు, వేడుకకు హాజరయ్యేవారికి ప్రత్యేకంగా పార్కింగ్ స్థలాలను కేటాయించడంతో పాటు ట్రాఫిక్ రూట్ మ్యాప్‌ను సిద్ధం చేయాలని పోలీసు శాఖకు సూచించారు. అగ్నిమాపక పరికరాలు అందుబాటులో ఉంచాలని ఫైర్ శాఖను, అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేయాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. వెయ్యి మంది కళాకారులతో ప్రదర్శనలు ఏర్పాటు చేయనున్నామని కల్చరల్ డిపార్ట్‌మెంట్ అధికారులు సీఎస్‌కు తెలిపారు. సాంప్రదాయ వస్త్రధారణతో కళాకారుల ప్రదర్శనలు వేదికకు వన్నె తెచ్చేలా ఉంటాయని అధికారులు వివరించారు. వచ్చేనెల 13న ఫుల్ డ్రెస్ రిహార్సల్స్ జరగనుండగా.. 10వ తేదీ నుంచి రిహార్సల్స్ ఉంటాయని అధికారులు వివరించారు.

# చరిత్ర నుంచి పాకిస్థాన్ గుణపాఠం నేర్చుకోలేదు

మొదటి పేజీ తరువాయి...

వినబడతాయి. ముష్కరులను పెంచి పోషిస్తున్న వారికి నేను చెప్పేది ఒక్కటే. వారి దుర్మార్గపు కుట్రలు ఎన్నటికీ ఫలించవు. మా దళాలు ఉగ్రవాదాన్ని నలిపివేసి శత్రువులకు తగిన జవాబిస్తాయి" అని మోదీ పాక్‌కు గట్టి వార్నింగ్ ఇచ్చారు.

### అగ్నిపథ్ విమర్శలపై ప్రతిపక్షాలకు కౌంటర్

మరోవైపు అగ్నిపథ్ పథకంపై విపక్షాలు చేస్తున్న విమర్శలను ప్రధాని మోదీ తీవ్రంగా ఖండించారు. భారత బలగాలకు సంబంధించి పెన్షన్ నిధులు ఆదా చేసేందుకే ఈ పథకం తీసుకువచ్చారంటూ చేస్తున్న వ్యాఖ్యలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ పథకాన్ని సమర్థిస్తూ మాట్లాడిన ఆయన, దేశ సైన్యాన్ని ఆధునికీకరించడానికి, బలోపేతం చేయడానికి అవసరమైన సంస్కరణ అని చెప్పారు.




# మోదీ 3.0లో తొలి నీతి ఆయోగ్ సమావేశం

## కాంగ్రెస్ సీఎంల డుమ్మా

న్యూఢిల్లీ, జులై 26 (ప్రభాత ఉదయం): కేంద్రంలో ముచ్చటగా మూడోసారి ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చి.. ప్రధానమంత్రిగా నరేంద్ర మోదీ హ్యాట్రిక్ ప్రమాణ స్వీకారం చేశారు. ఈ క్రమంలోనే మోదీ 3.0 నిర్ణయాలు, భవిష్యత్‌లో తీసుకోవాల్సిన నిర్ణయాలను క్రమంగా వెల్లడిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే నీతి ఆయోగ్ 9వ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశం.. శనివారం జరగనుంది. ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్ కల్చరల్ సెంటర్‌లో జరిగే ఈ నీతి ఆయోగ్ సమావేశానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షత వహించనున్నారు. ఈ సమావేశానికి సంబంధించి శుక్రవారం ఒక అధికార ప్రకటన వెలువడింది. ఇక ఈ నీతి ఆయోగ్ సమావేశ ఎజెండాను కూడా కేంద్రం వెల్లడించింది. "వికసిత్ భారత్‌ఏ2047" అనే థీమ్‌తో.. అభివృద్ధి చెందిన దేశంగా భారత్‌ను రూపొందించడమే లక్ష్యంగా ఈ సమావేశం దృష్టి సారించనుంది. వికసిత్ భారత్ ఏ2047 విజన్ డాక్యుమెంట్ కోసం అప్రోచ్ పేపర్‌పై ఈ సమావేశం చర్చిస్తుందని కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన ఆ ప్రకటనలో తెలిపింది. ఈ క్రమంలోనే కేంద్ర, రాష్ట్రాల మధ్య పరస్పర సహకారాన్ని మరింత వేగవంతం చేయడంతోపాటు గ్రామీణ, పట్టణ జనాభా జీవన ప్రమాణాలను పెంచేందుకు తీసుకోవాల్సిన చర్యలపైనా నీతి ఆయోగ్ సమావేశంలో చర్చించనున్నారు. 2047 నాటికి 30 ట్రిలియన్ డాలర్ల కంటే ఎక్కువ జీడీపీతో ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలవాలనే లక్ష్యాన్ని భారత్ ఇప్పటికే నిర్దేశించుకుంది. 2047 నాటికి ఈ లక్ష్యాన్ని సాధించడానికి.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సహకార బంధం ఉండేలా నీతి ఆయోగ్ 9 వ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశంలో చర్చించి.. ఈ వికసిత్ భారత్ ఏ 2047 విజన్ సాకారానికి రోడ్ మ్యాప్‌ను రూపొందించనున్నారు. గతేడాది డిసెంబర్ 27 నుంచి 29 వ తేదీల మధ్య జరిగిన 3 వ చీఫ్ సెక్రటరీల జాతీయ సదస్సులో చేసిన సిఫారసులపైనా నీతి ఆయోగ్ సమావేశంలో చర్చించనున్నారు. అప్పటి సదస్సులో చర్చకు వచ్చిన సైబర్ సెక్యూరిటీ, ఆస్పిరేషనల్ డిస్ట్రిక్స్ అండ్ బ్లాంక్స్ ప్రోగ్రామ్, రోల్ ఆఫ్ స్టేట్, ఏఐ ఇన్ గవర్నెన్స్ అంశాలపైనా ప్రత్యేక సదస్సులు నిర్వహించనున్నారు. ఇక కేంద్రం ఇటీవల పార్లమెంటులో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఎన్డీఏ మిత్రపక్షాలకే నిధులు కేటాయించి ప్రాధాన్యత ఇచ్చిందని ప్రతిపక్ష ఇండియా కూటమి తీవ్ర ఆరోపణలు చేస్తూనే ఉంది. ఈ క్రమంలోనే విపక్ష పాలిత రాష్ట్రాలను పట్టించుకోలేదని మండిపడ్డారు. ఈ నేపథ్యంలోనే నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం చూపిన వివక్షకు నిరసనగా నీతి ఆయోగ్ సమావేశాన్ని బహిష్కరిస్తామని కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల సీఎంలు ఇప్పటికే ప్రకటించారు. కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, హిమాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి సుఖ్వీందర్ సుఖు నీతి ఆయోగ్ సమావేశానికి హాజరుకామని తెలిపారు.

# పెట్రోల్, డీజిల్ ధరల తగ్గింపుపై నిర్మలమ్మ కీలక వ్యాఖ్యలు

## జీఎస్టీ కౌన్సిల్‌లో నిర్ణయం

న్యూఢిల్లీ, జులై 26 (ప్రభాత ఉదయం): పెట్రోల్, డీజిల్ ధరల తగ్గింపుపై కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ కీలక వ్యాఖ్యలు చేశారు. కేంద్ర బడ్జెట్ ప్రవేశపెట్టిన తర్వాత వరుసగా మీడియాకు ఇంటర్వ్యూలు ఇస్తున్న నిర్మలా సీతారామన్.. ఇటీవలె రాష్ట్రాల్లో అమలు అవుతున్న ఉచిత బస్సు పథకంతోపాటు మిగిలిన ఉచిత పథకాలపై స్పందించారు. ఇక తాజాగా జరిగిన ఓ ఇంటర్వ్యూలో పెట్రోల్, డీజిల్ ధరల తగ్గింపుపై అడిగిన ప్రశ్నకు ఆమె ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఇంధన ధరల తగ్గింపుపై జీఎస్టీ కౌన్సిల్ ఒక నిర్ణయం తీసుకుంటుందని నిర్మలమ్మ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా బడ్జెట్‌పై పలు అంశాలపై ఆమె కీలక విషయాలను వెల్లడించారు. పెట్రోల్, డీజిల్ ధరల తగ్గింపుపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సయోధ్య కుదరాలని ఈ సందర్భంగా కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో పెట్రోల్, డీజిల్ ధరల తగ్గింపుపై ఓ నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. అయితే ఈ విషయంలో అన్ని రాష్ట్రాలు కూడా కలిసివస్తేనే ఓ నిర్ణయం తీసుకునే అవకాశం ఉంటుందని శుక్రవారం ఓ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. ఈ సందర్భంగానే బడ్జెట్‌లోని పలు అంశాలపై ఆమె స్పందించారు. కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఏ రాష్ట్రానికీ అన్యాయం జరగలేదని చెప్పారు. బీజేపీ మిత్ర పక్షాలు అధికారంలో ఉన్న ఆంధ్రప్రదేశ్, బీహార్ రాష్ట్రాలను మాత్రమే బడ్జెట్ ప్రసంగంలో ప్రస్తావించారని ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలను ఆమె ఖండించారు. 2014 లో రాష్ట్ర విభజన జరిగి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన నేపథ్యంలో ఏపీకి విభజన చట్టం ప్రకారం కేంద్ర ప్రభుత్వం సహాయం చేయాల్సిన అవసరం ఉందని నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు. గతంలో మాదిరిగానే రాష్ట్రాలకు కేటాయింపులు జరిగాయని.. ఏ ఒక్క రాష్ట్రానికి కూడా నిధులు కేటాయించకుండా ఉండలేదని తేల్చి చెప్పారు. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం ప్రకారం కొత్త రాజధాని నిర్మాణంతో పాటు.. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం సాయం చేయాల్సి ఉందని వెల్లడించారు. అయితే కేంద్ర బడ్జెట్‌లో బీహార్ రాష్ట్రానికి రూ.26 వేల కోట్లు.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి రూ.15 వేల కోట్లు ప్రకటించి.. ఎన్డీఏలో మిత్రపక్షాలకే ప్రాధాన్యత ఇచ్చారని.. ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలను విస్మరించారని



ఇండియా కూటమి నేతలు తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఈ నేపథ్యంలోనే కేంద్ర ప్రభుత్వం తమ రాష్ట్రాలపై చూపిన వివక్షకు నిరసనగా శనివారం ఢిల్లీలో జరిగే నీతి ఆయోగ్ సమావేశాన్ని బహిష్కరిస్తామని కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు సిద్ధరామయ్య (కర్నాటక), రేవంత్ రెడ్డి (తెలంగాణ). సుఖ్వీందర్ సుఖు (హిమాచల్ ప్రదేశ్) ప్రకటించారు. మరోవైపు.. విపక్ష ఇండియా కూటమి భాగస్వామ్య పార్టీ.. తమిళనాడులో అధికారంలో ఉన్న ఎంకే స్టాలిన్ నేతృత్వంలోని డీఎంకే కూడా తమ రాష్ట్రాన్ని కేంద్ర ప్రభుత్వం విస్మరించిందని తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. కేరళలో ఒక్క ఎంపీ సీటు గెలిచినా.. రాష్ట్రానికి మేలు జరుగుతుందని చెప్పిన బీజేపీ.. ఒక ఎంపీ గెలిచినా కేరళ ఖాతాను మాత్రం క్లోజ్ చేశారని లెఫ్ట్ ఫ్రంట్ నేతలు తీవ్ర విమర్శలు గుప్పించారు.

రాష్ట్రస్థాయిలో టాపర్లుగా నిలిచిన రాజేంద్రనగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు

# నగదు బహుమతులు, సన్మానాలు



బైపీసీ ద్వితీయ సంవత్సరం లో స్టేట్ టాపర్ గా నిలిచిన పి. నిష్ణ పై పూల వర్షం కురిపిస్తున్న కళాశాల ప్రిన్సిపల్ ఎర్ర అంజయ్య తదితరులు



బైపీసీ ప్రథమ సంవత్సరంలో స్టేట్ టాపర్ గా నిలిచిన ఫాతిమా ను సన్మానిస్తున్న రాజేంద్రనగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు

బుద్వేల్, జూలై 26 (ప్రభాత ఉదయం): రాజేంద్రనగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు శుక్రవారం లక్ష రూపాయల నగదు బహుమతులను అందచేశారు. ఇంటర్ వార్షిక పరీక్షలలో తెలంగాణ రాష్ట్రంలోనే టాపర్స్ గా నిలిచిన పి నిష్ణ , ఫాతిమ లతో పాటు అత్యధిక మార్కులు సాధించిన 33 మంది విద్యార్థులకు దాతల సహకారంతో లక్ష రూపాయల నగదు బహుమతులను అందజేశారు. ఆమేజాన్ ఉద్యోగి నరేందర్ రెడ్డి - సౌజన్య, వెటర్నరి యూనివర్శిటి ప్రొఫెసర్ స్వాతీ రెడ్డి విద్యార్థులకు నగదు బహుమతులు ఇచ్చి విద్యార్థులను ప్రోత్సహించారు. నరేందర్ రెడ్డి , సౌజన్య లు గత రెండు సంవత్సరాలు నుండి నగదు బహుమతి ఇస్తున్నారు ఈ సందర్భంగా దాతలు మాట్లాడుతూ, విద్యార్థులు కష్టపడి ఉన్నత శిఖరాలకు ఎదగాలని, భవిష్యత్తులో మంచిస్థానంలో ఉండి ఇతరులకు సహాయపడాలని తెలిపారు. ఈ కళాశాల ఇప్పటికే అన్ని రంగాలలో ముందుండి విద్యార్థుల శ్రేయస్సు కొరకు పాటుపడ్తుందని అన్నారు. కళాశాల విద్యార్థులు కార్పోరేట్ విద్యార్థులతో పోటిపడ్తున్నారని అన్నారు. రాష్ట్ర స్థాయిలో ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందించి పూలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎర్ర అంజయ్య మట్లాడుతూ విద్యార్థులు మరియు అధ్యాపకులు రాష్ట్ర స్థాయిలో కళాశాలకు గుర్తింపు తెచ్చారన్నారు. ప్రిన్సిపాల్ దాతలకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది మాన్య, స్వప్న, కిరణ్ కుమార్, యన్ చంద్రశేఖర్, కృష్ణా రెడ్డి, మురళీ, కరుణాకర్, శ్రీజన్య, నవీన్, కిషన్, గోపి కృష్ణా రెడ్డి, చంద్రశేఖర్, పార్థసారథి, శశిధర్, భరత్, నర్సింగ్, కుమార్, పర్వీన్, రఫి పాల్గొన్నారు.



అమ్మవారి దేవాలయాల వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి

## అమ్మవారి దేవాలయాల వద్ద ఏర్పాట్లు చేయండి

బుద్వేల్, జూలై26(ప్రభాత ఉదయం) : రాజేంద్ర నగర్ సర్కిల్ మైలర్ దేవ్ పల్లి డివిజన్ పరిధిలోని మధుబన్ కాలనీ , పద్మశాలిపురం బస్తీలలో బోనాల పండుగ సందర్భంగా దేవాలయ పరిసర ప్రాంతాలలో చేపట్టాల్సిన ఏర్పాట్లు , మౌలిక సదుపాయాలు కల్పన కోసం రాజేంద్ర నగర్ నియోజక వర్గ కాంటెస్టడ్ ఎమ్మెల్యే అభ్యర్థి, మైలార్ దేవ్ పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి జీహెచ్ఎంసీ, వాటర్ వర్క్స అధికారులతో, బస్తీ వాసులతో కలసి పనులను పర్యవేక్షించడం జరిగింది. అదే విధంగా మధు బన్ కాలనీ లోని పద్మశాలి పురం రోడ్డు ప్యాచ్ వర్క్స , వర్ష కాలాన్ని దృష్టిలో ఉంచుకొని కాలినడకన దేవాలయానికి వచ్చే భక్తులకు, ప్రజలకు, ఇబ్బంది కలగకుండా ఉండాలని అధికారులు తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించడం జరిగింది. ఈ సందర్బంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, బోనాల పండుగ ఉత్సవాలు దృష్ట్యా అభివృద్ధి పనులలో ఎక్కడ కూడా నాణ్యత లోపాలు లేకుండా సకాలం లో నిర్ణీత సమయం లో అభివృద్ధి పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొని రావాలని అధికారులను ఆదేశించడం జరిగింది. పరిసరాల పరిశుభ్రత, స్ట్రీట్ లైట్స్ మరమ్మత్తు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కార్పొరేటర్ అధికారులను ఆదేశించడం జరిగింది. బోనాల పండుగ దృష్ట్యా ప్రత్యేక చొరవ తీసుకుని పనులను ప్రారంభించి నందుకు, చేయిస్తునందుకు బస్తీ నాయకులు, బస్తీ వాసులు కార్పొరేటర్ కు కృతజ్ఞతలు తెలుపుతూ శాలువాతో ఘనంగా సన్మానించడం జరుగింది. ప్రజలందరు శాంతియుత వాతావరణం లో బోనాల పండుగ ఉత్సవాలు ఆనందంగా జరుపుకోవాలని కార్పొరేటర్ ఆకాంక్షించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బుచ్చి రెడ్డి, నరసింహారెడ్డి, ఎల్ వీ రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, రాజ్ కుమార్ , అవినాశ్, మల్లికార్జున్, ఏ ఈ నరసింహమూర్తి, వర్క్ ఇన్స్పెక్టర్ రాహుల్ , వాటర్ వర్క్స సూపర్వైజర్ వినయ్, ఎస్ఎఫ్ఐ జాషువా, జీహెచ్ఎంసీ సిబ్బంది, బస్తీ వాసూలు పాల్గొనడం జరిగింది.



భారతీయ విద్యా భవన్ ప్రిన్సిపాల్ రవికిరణ్ జన్మదిన సందర్భంగా సన్మానిస్తున్న బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి వై శ్రీధర్

## ప్రిన్సిపాల్ రవి కిరణ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన నాయకులు

రాజేంద్రనగర్, జూలై 26(ప్రభాత ఉదయం) రాజేంద్రనగర్ జాతీయ గ్రామీణ అభివృద్ధి సంస్థలో ఆవరణలో గల భారతీయ విధ్యా భవన్స్ స్కూల్ ప్రిన్సిపాల్ గౌ రవికిరణ్ జన్మదినం సందర్భంగా జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి రంగారెడ్డి ధీరజ్ యాదవ్ , యాదగిరి, ఆర్ పవన్ రాజ్, ఈ.వేణుగోపాల్. నితీశ్ .పి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



జీవో 317తో నష్టపోయిన

## ఉద్యోగుల వివరాలు ఇవ్వాలి

కేబినెట్ సబ్ కమిటీ

హైదరాబాద్,జులై 26 (ప్రభాత ఉదయం): జీవో 317 వల్ల నష్టపోయిన ఉద్యోగులను గుర్తించి వారి వివరాలను వీలైనంత త్వరగా ఇవ్వాలని అధికారులను మంత్రివర్గ ఉపసంఘం ఆదేశించింది. జీవో 317పై సచివాలయంలో మంత్రివర్గ ఉపసంఘం ఛైర్మన్ దామోదర రాజనర్సింహ అధ్యక్షతన సభ్యులు శ్రీధర్‌బాబు,పొన్నం ప్రభాకర్ వివిధ శాఖల ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు.ఇవాళ మరికొన్ని శాఖల నివేదికలు సమర్పించగా...మరిన్ని విభాగాల నుంచి పూర్తి వివరాలు అందలేదని కేబినెట్ సబ్ కమిటీ తెలిపింది.వెబ్‌సైట్ ద్వారా అందిన దరఖాస్తుల్లో సుమారు 30 నుంచి 40 శాతం పునరావృతమైనట్టు కమిటీ గుర్తించింది.అన్యాయం జరిగిన వారికి న్యాయం చేయాలన్న ప్రభుత్వ ప్రయత్నాలను ఉపయోగించుకొని కొందరు సొంత జిల్లాలకు వెళ్లేందుకు తప్పుడు ప్రయత్నాలు చేస్తున్నట్టు అధికారులు కమిటీ దృష్టికి తెచ్చారు. నష్టపోయిన వారి వివరాలు మాత్రమే గుర్తించి నివేదిక ఇవ్వాలని అధికారులకు సబ్ కమిటీ స్పష్టం చేసింది.ఈ సమావేశంలో వివిధ శాఖల ముఖ్య కార్యదర్శులు,కమిషనర్లు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## మహావీర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కాలేజీలో జూనియర్ విద్యార్థులను గాయపరిచిన సీనియర్ విద్యార్థులపై కేసులు నమోదు

బుద్వేల్, జూలై26(ప్రభాత ఉదయం) : జూనియర్ విద్యార్థులను గాయపరిచిన సీనియర్ విద్యార్థులపై కేసులు నమోదయ్యాయి . ఆలస్యంగా వెలుగు చూసిన ఈ సంఘటన వివరాలు ఈ విధంగా ఉన్నాయి . రాజేంద్రనగర్ సర్కిల్ మైలార్ దేవ్ పల్లి పల్లె చెరువు సమీపంలో గల మహావీర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కాలేజీలో పాలిటెక్నిక్ డిప్లొమా ప్రథమ, ద్వితీయ సంవత్సరాలు చదువుతున్న విద్యార్థుల మధ్య జరిగిన గొడవ పోలీస్ స్టేషన్ వరకు చేరుకుంది. ఐదుగురు విద్యార్థులను అరెస్టు చేసి వారికి స్టేషన్ బెయిల్ ఇచ్చారు. ఈనెల 23న పాలిటెక్నిక్ డిప్లమా చదువుతున్న విద్యార్థులకు సెమినార్ నిర్వహించారు. ఆ సెమినార్ కు హాజరు కావాలని మొదటి సంవత్సరానికి చెందిన ముగ్గురు విద్యార్థులు అన్ని తరగతులకు తిరుగుతూ తెలియపరచడం జరిగింది. దీంతో ఆగ్రహించిన ద్వితీయ సంవత్సరం విద్యార్థులు మీకేం పని అంటూ వారితో గొడవపడ్డారు. సీనియర్ విద్యార్థులకు ఇస్తున్న మర్యాద ఇదేనా అంటూ వాష్ రూమ్స్ దగ్గర జూనియర్ విద్యార్థులపై దాడి చేసి గాయపరిచారు. ఈ విషయమే గాయపడ్డ విద్యార్థులు ప్రిన్సిపాల్ రవీందర్ రెడ్డి కి ఫిర్యాదు చేయగా ఆయన మైలార్ దేవ్ పల్లి పోలీసులకు సమాచారం అందజేశారు . ఇన్స్ పెక్టర్ నరేందర్ పర్యవేక్షణలో ఎస్ఐ నాయుడు విచారణ జరిపి ఐదుగురు విద్యార్థులపై కేసులు నమోదు చేసి స్టేషన్ బెయిల్ అందజేశారు.

**విద్యార్థులకు కౌన్సిలింగ్ ఇచ్చి పంపించాం : రాజేంద్రనగర్ ఏసీపీ టి శ్రీనివాస్**

మహావీర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కాలేజీలో జూనియర్ , సీనియర్ విద్యార్థుల మధ్య జరిగిన గొడవలో ముగ్గురు జూనియర్ విద్యార్థులను గాయపరిచిన ఐదుగురు సీనియర్ విద్యార్థులను పిలిచి వారికి కౌన్సిలింగ్ ఇవ్వడం జరిగింది. ఈనెల 24న కేసులు నమోదు చేశాం . కళాశాలలో అధ్యాపకుల కమిటీ ద్వారా విచారణ జరిపి వారిపై చర్యలు తీసుకోవాలని సూచించాం



## సామూహిక లలితా సహస్రనామ పారాయణం చేస్తే సకల కోరికలు నెరవేరుతాయి

మేయర్ శ్రీలత ప్రేమ గౌడ్.. బండ్లగూడ శ్రీబుజలి మహంకాళి అమ్మ ఆలయంలో లోమహిళలు ఆషాడ మాస గోరింటాకు కార్యక్రమం..

బండ్లగూడ,జులై 26(ప్రభాత ఉదయం) ప్రతి ఇంట్లో లలితా సహస్రనామాన్ని క్రమం తప్పకుండా జపించడం వల్ల కుటుంబ సభ్యుల మధ్య శాంతి,ఐక్యత పెరుగుతుందని బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మద్దెల శ్రీలత ప్రేమ గౌడ్ అన్నారు.ఆషాడ మాసాన్ని పురస్కరించుకుని పాల్గొన్నారు. శుక్రవారం ఆషాడ మాస ఆడపడుచుల గోరింటాకు సంబరాల్లో బండ్లగూడ కార్పొరేషన్ మేయర్ లతా ప్రేమ్ గౌడ్ స్థానిక మహిళలతో కలిసి శ్రీబుజలి మహంకాళి అమ్మ ఆలయంలో గోరింటాకు సంబరాలు చేసుకున్నారు నివాసంలో మహిళలు సామూహిక లలిత సహస్రనామ స్తోత్రాలు పారాయణం చేశారు.అనంతరం మహిళలందరూ కలిసి సామూహికంగా గోరింటాకు సంబరాలు జరుపుకున్నారు.ఈ సందర్భంగా మేయర్ శ్రీలత ప్రేమ్ గౌడ్ మాట్లాడుతూ...ప్రతిరోజూ భక్తిశ్రద్ధలతో లలితా సహస్రనామాన్ని జపించేవారిని దేవి సదా రక్షిస్తుందన్నారు.వారు ఎప్పుడూ ఆహారం,ప్రాథమిక అవసరాల కొరతను ఎదుర్కోరని,ఆధ్యాత్మిక వృద్ధిని కూడా పొందుతారని తెలిపారు.భారతీయ సంస్కృతి సాంప్రదాయాలలో గోరింటాకు మహిళలు పెట్టుకోవడం ఆనవాయిత అన్నారు. మహిళలు అమ్మవారి పూజలు నిర్వహించి సామూహిక గోరింటాకు కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు.ఈ తదితరులు పాల్గొన్నారు.



## బోనాల ఉత్సవాలకు సర్వం సిద్ధం

కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి

రాజేంద్రనగర్,జులై 26 (ప్రభాత ఉదయం): బోనాల ఉత్సవాల్లో ప్రజలు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుందని రాజేంద్రనగర్ బీజేపీ కంటెస్టెంట్ ఎమ్మెల్యే,డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు.రాజేంద్రనగర్ సర్కిల్ మైలార్ దేవ్ పల్లి డివిజన్ పరిధిలోని మధుబన్ కాలనీ,పద్మశాలిపురం బస్తీలోని అమ్మవారి దేవాలయాల్లో మౌలిక సదుపాయాలు కల్పన కోసం జీహెచ్ఎంసీ,జలమండలి అధికారులు,బస్తీ వాసులతో కలసి తోకల శ్రీనివాస్ రెడ్డి పనులను పర్యవేక్షించారు.బోనాల పండుగ సందర్భంగా దేవాలయ పరిసర ప్రాంతాలలో చేపట్టాల్సిన ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు.అమ్మవారికి బోనాలను సమర్పించే భక్తులకు,ఘటాల,ఫలహార బండ్ల ఊరేగింపునకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు తీసుకున్నామని అధికారులకు ఆదేశించారు.పారిశుద్ధ్యం బాగుండాలని సూచించారు.అదేవిధంగా మధుబన్ కాలనీ,పద్మశాలిపురం,రోడ్డు ప్యాచ్ వర్క్స,అలాగే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని కాలినడకన దేవాలయానికి వచ్చే భక్తులకు,ప్రజలకు,ఇబ్బంది కలగకుండా ఉండాలని అధికారులు తగిన చర్యలు చేపట్టాలని సూచించారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ..బోనాలను కోసం ప్రత్యేకంగా కృషి చేయడం జరుగుతుందని తెలిపారు.బోనాలకు ఆలయాలు సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నామని,ఇప్పటికే ఆయా ఆలయాల్లో అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు.భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు.బోనాల పండుగ ఉత్సవాల దృష్ట్యా అభివృద్ధి పనులలో నాణ్యత లోపాలు లేకుండా సకాలంలో నిర్ణీత సమయంలో అభివృద్ధి పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొని అధికారులకు వెల్లడించారు.సానిటేషన్,స్ట్రీట్ లైట్స్ మరమ్మత్తు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కార్పొరేటర్ అధికారులను ఆదేశించారు.బోనాల పండుగ దృష్ట్యా ప్రత్యేక చొరవ తీసుకుని పనులను ప్రారంభించినందుకు,చేయిస్తున్నందుకు బస్తీ నాయకులు,బస్తీ వాసులు కార్పొరేటర్ కు కృతజ్ఞతలు తెలిపి శాలువాతో ఘనంగా సన్మానించారు.ప్రజలందరూ శాంతియుత వాతావరణంలో బోనాల పండుగ ఉత్సవాలు ఆనందంగా జరుపుకోవాలని కార్పొరేటర్ ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో చెన్ రెడ్డి బుచ్చిరెడ్డి,నరసింహారెడ్డి,లిక్కి వెంకటేశ్వర్ రెడ్డి, గోవర్ధన్ రెడ్డి,రాజ్ కుమార్,అవినాశ్,మల్లికార్జున్, ఏఈ నరసింహమూర్తి, వర్క్ ఇన్స్పెక్టర్ రాహుల్, జలమండలి సూపర్ వైజర్ వినయ్,ఎస్ఎఫ్ఐ జాషువా, జిహెచ్ఎంసి సిబ్బంది,బస్తీ వాసులు తదితరులు పాల్గొన్నారు.



## బోనాలకు కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డిని ఆహ్వానించిన బాబుల్ రెడ్డినగర్ పోచమ్మ అమ్మవారి బోనాల ఉత్సవాల కమిటీ

రాజేంద్రనగర్,జులై 26(ప్రభాత ఉదయం) ఆషాడ బోనాల సందర్భంగా మైలార్ దేవులపల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డిని బాబుల్ రెడ్డి నగర్ నల్ల పోచమ్మ దేవాలయం కమిటీ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ నెల 28 వ తేదీ ఆదివారం నిర్వహించే నల్ల పోచమ్మ అమ్మవారి బోనాల ఉత్సవాలకు కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డిని కమిటీ సభ్యులు కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు.ఈ మేరకు బోనాల ఉత్సవాలకు రావాలని ఆహ్వాన పత్రికను అందజేశారు.బోనాల ఉత్సవాలకు ఆహ్వానించిన వారిలో నల్ల పోచమ్మ దేవాలయం అధ్యక్షులు ఉప్పల్ శీను,మాజీ కౌన్సిలర్ వెంకటేష్ కురుమ,సోమ శ్రీనివాస్ గుప్త,రమేష్ రెడ్డి,పోతురాజు మల్లేష్,సెంట్రింగ్ శంకర్,అశోక్,సందీప్,తదితరులు పాల్గొన్నారు.

# ఈ నెల 28న రాజేంద్రనగర్‌లో బోనాలు




రాజేంద్రనగర్ శ్రీ మాతా పోచమ్మ దేవాలయం...



అమ్మ వారు ..



ఏర్పాట్లు చేయాలని డిప్యూటీ కమిషనర్ కె రవి కుమార్ కు వినతి...



బందోబస్తు కోసం రాజేంద్రనగర్ ఇన్స్ పెక్టర్ క్యాస్ట్రో కు వినతి

బుద్వేల్, జూలై26(ప్రభాత ఉదయం): రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో ఈనెల 28న బోనాల ఉత్సవాలు నిర్వహించడానికి దేవాలయ కమిటీల సభ్యులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసుకున్నారు. అమ్మవారి దేవాలయాలను అందంగా ముస్తాబు చేశారు. రంగులు వేసి, విద్యుత్ దీపాలతో అలంకరించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఆదివారం రోజున అమ్మవారి దేవాలయాల వద్ద పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేటట్లు చర్యలు తీసుకోవాలని రాజేంద్రనగర్ సర్కిల్ జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ కె. రవి కుమార్ కు, బందోబస్తు కల్పించాలని రాజేంద్రనగర్ ఇన్స్ పెక్టర్ క్యాస్ట్రోకు వినతిపత్రాలు అందజేశారు. రాజేంద్రనగర్ లో శ్రీ మాతా పోచమ్మ దేవాలయం కమిటీ అధ్యక్షులు దుంబాల ఉమా రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాట్లు జరుగుతున్నాయి.

# తెలంగాణ బడ్జెట్‌లో గ్రేటర్‌కు పుష్కలంగా నిధులు

## హైదరాబాద్ మహానగరాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి పరిచేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుంది... శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి జగదీశ్వర్ గౌడ్

కూకట్‌పల్లి, జూలై 26 (ప్రభాత ఉదయం) తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ 2024 లో జీహెచ్ఎంసి హైదరాబాద్ నగర అభివృద్ధికి నిధులు కేటాయించిన సందర్భంగా నల్లగండ్ల గ్రామంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం లో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి, ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క చిత్రపటానికి శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి జగదీశ్వర్ గౌడ్ పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వానికి గ్రేటర్ హైదరాబాద్ అభివృద్ధిపై చిత్తశుద్ధి ఉందని, తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం పక్క ప్రణాళికతో గ్రేటర్ హైదరాబాద్ నగరాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తుందని అన్నారు. అందులో భాగంగానే శరవేగంగా అభివృద్ధి చెందుతున్న చారిత్రాత్మక నగరం హైదరాబాద్ మరింత ప్రణాళికాబద్ధంగా తీర్చిదిదేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉన్నామనే సంకేతాన్ని ప్రభుత్వం నిజంచేసిందని, ప్రజలకు అభివృద్ధిని మరింత చేరువ చేసేందుకు, సిటీ అభివృద్ధి మరింత వేగంగా జరిగేందుకు బడ్జెట్లో రూ.10వేల కోట్లు, మౌళికవసతులకు రూ.3,065 కోట్లు, హెచ్ఎండిఏకు రూ.500కోట్లు, మెట్రో విస్తరణకు రూ.600 కోట్ల భారీ నిధులు కేటాయించిందని అన్నారు. ఈ సందర్భంగా శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని ప్రతి గడపకు వెళ్ళి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని, ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారం చూపుతామని, నియోజకవర్గ పరిధిలోని ప్రతి కాలనీ, బస్తీలో అభివృద్ధి పనులను సంబంధిత అధికారులతో త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చేల అహర్నిశలు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి నియోజకవర్గ డివిజన్ అధ్యక్షులు, మహిళలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.



# గ్రామాభివృద్ధిలో కార్యదర్శి పాత్ర మరువలేనిది

## రామనాథ్ ముదిరాజ్

శంషాబాద్,జూలై 26( ప్రభాత ఉదయం) గాన్సీమియా గూడ గ్రామ అభివృద్ధిలో గ్రామ కార్యదర్శ శ్రీకాంత్ గౌడ్ చేసిన కృషి ఎనలేనిదని ఝూన్సీ మియా గూడ రేణుక ఎల్లమ్మ తల్లి దేవాలయ కమిటీ చైర్మన్గుగ్గిళ్ళ రామనాథ ముదిరాజ్ పేర్కొన్నారు. గత ఎనిమిది సంవత్సరాలుగా గ్రామ కార్యదర్శిగా పనిచేసిన శ్రీకాంత్ గౌడ్ బదిలీపై వెళ్తుండడంతో శుక్రవారం ఆయనను కలిసి శాలువా పూల మాలలతో సన్మానించి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా రామనాథం మాట్లాడుతూ గాన్సీమియా గూడ, గండిగూడ గ్రామాల అభివృద్ధికి శ్రీకాంత్ గౌడ్ ఎంతో కృషి చేశారని అన్నారు. గ్రామ సర్పంచ్ ఎంపీటీసీలు పంచాయతీ సభ్యులకు ప్రజలకు అనుసంధానంగా ఉంటూ ప్రభుత్వానికి ప్రజలకు మధ్యన వారధిగా ఉంటూ ఆయన పనిచేశారని అన్నారు. ఆయన బదిలీపై వెళ్లడం తమకు ఎంతో బాధగా ఉన్నదని పేర్కొన్నారు.



# కాంగ్రెస్ అంటేనే రైతు సంక్షేమ ప్రభుత్వం

## సరళ సాగర్ ప్రాజెక్టుని విడుదల చేసిన ఎమ్మెల్యే జిఎంఆర్.. సంతోషం వ్యక్తం చేసిన రైతులు

కొత్తకోట, జూలై 26(ప్రభాత ఉదయం) కాంగ్రెస్ అంటేనే రైతు సంక్షేమ ప్రభుత్వం అని దేవరకద్ర నియోజకవర్గం ఎమ్మెల్యే జిఎంఆర్ అన్నారు. శుక్రవారం నియోజకవర్గంలోని మదనపురం మండలం సరళ సాగర్ ప్రాజెక్టు నుండి రైతుల పంట పొలాలకు అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులతో కలసి దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి సాగు నీటిని విడుదల చేశారు. అనంతరం ఎమ్మెల్యే జీఎంఆర్ మాట్లాడుతూ... సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ప్రగతి పథంలో ముందుకు సాగుతుందన్నారు. మంచి హృదయం ఉన్న నాయకుడు రేవంత్ రెడ్డి అని దీంతో వరుణదేవుడు ఆశీస్సులతో నదులు చెరువులు నిండి రైతులకు సంపూర్ణ వ్యవసాయానికి అనుకూల వాతావరణ లభించిందన్నారు. సకాలంలో వర్షాలు కురవడం, రైతుల పంట పొలాలకు నీటిని విడుదల చేయడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు.



సరళ సాగర్ నీటిని వాల్వ్ తిప్పి వదులుతున్న ఎమ్మెల్యే జీఎంఆర్



# పోస్ట్ ఆఫీస్ సేవలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలి

## ఫతేనగర్ డివిజన్ కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్

కూకట్‌పల్లి, జూలై 26 (ప్రభాత ఉదయం) ప్రజలకు అందుబాటులోకి సరికొత్త పద్ధతిలో పోస్ట్ ఆఫీస్ సేవలను పోస్ట్ ఆఫీస్ వారు అందిస్తున్నారని ప్రజలందరూ వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఫతేనగర్ డివిజన్ కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ అన్నారు. శుక్రవారం ఫతేనగర్ డివిజన్ పరిధిలోని భగత్ సింగ్ పార్క్ కమ్యూనిటీ హాల్ లో సనత్ నగర్ పోస్ట్ ఆఫీస్ సూపరిండెంట్ రామకృష్ణ ఆధ్వర్యంలో డిసిడిపి కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనిలో భాగంగా ప్రజల ఇంటి వద్దకే పోస్ట్ ఆఫీసు సేవలు అనగా పోస్ట్ ఆఫీస్ ఖాతాలు, పోస్టల్ బ్యాంకింగ్ సేవలు, ఆక్సిడెంటల్ ఇన్సూరెన్స్, ఆధార్ సేవలు, పోస్ట్ ఆఫీస్ ఇన్సూరెన్స్ సేవలు, గంగా జల్ లాంటి తదితర సేవలు అందించడం జరుగుతుంది. ఈ కార్యక్రమానికి ఫతేనగర్ డివిజన్ కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి పోస్ట్ ఆఫీసు సేవలు తన కార్పొరేషన్ పరిధిలోని ప్రజలు అందరు సద్వినియోగం చేసుకోవాలి అని కోరారు. భవిష్యత్తులో పోస్ట్ ఆఫీస్ సేవలు ప్రజలకి చెరదీయడం లో తన వంతు కృషి చేస్తా అని తెలిపారు. ఈ కార్యక్రమం భగత్ సింగ్ నగర్ పార్కులో రెండు రోజులపాటు కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోస్టల్ సీనియర్ సూపరిండెంట్ రామ కృష్ణ, అసిస్టెంట్ సూపెరెండెంట్ శ్రీనివాస్ నాయక్, ఎస్ పి ఎం గోవిందా రావు, వీరితో పాటుగా ఫతేనగర్ డివిజనల్ మహిళా ప్రెసిడెంట్ శిల్ప, బిఆర్ఎస్ డివిజన్ సెక్రటరీ భిక్షపతి పాల్గొన్నారు.



# బోనాల ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో శాంతియుతంగా జరుపుకోవాలి

## ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

మల్కాజిగిరి, జూలై 26(ప్రభాత ఉదయం) బోనాల ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో శాంతియుతంగా జరుపుకోవాలని మల్కాజిగిరి శాసనసభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డి ఆలయ కమిటీలకు సూచించారు. శుక్రవారం బోనాల పండుగ సంధర్భంగా మల్కాజిగిరి నియోజకవర్గ పరిధిలోని వినాయక్ నగర్ డివిజన్ సూర్య నగర్ మహంకాళి ఆలయ నిర్వాహకలు, మౌలాలి డివిజన్ పి.బి.నగర్ కాలనీ పోచమ్మ ఆలయ నిర్వాహకులు తదితర ఆలయాల నిర్వాహకులు ఎమ్మెల్యే శ్రీ మర్రి రాజశేఖర్ రెడ్డి కి ఆహ్వానం అందజేశారు.

# ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

## కమిషనర్ సుమన్ రావు

శంషాబాద్,జూలై 26( ప్రభాత ఉదయం) వర్షాకాలం కావడంతో అంటువ్యాధులు సీజనల్ వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉన్నందున ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని శంషాబాద్ మున్సిపల్ కమిషనర్ బి సుమన్ రావు సూచించారు. డ్రై డే ఫ్రైడే కార్యక్రమంలో భాగంగా రంగారెడ్డి జిల్లా కలెక్టర్. సిడిఎంఎ. పురపాలక సంఘం పరిధిలోని అన్ని వార్డులలో పరిశుభ్రత కార్యక్రమాలను చేపట్టినట్లు ఆయన వివరించారు. శుక్రవారం వివిధ బస్తీలలో పర్యటించి పరిశుభ్రత కార్యక్రమాలను పర్యవేక్షించారు. వర్షాకాలం కావడంతో ఇళ్లల్లో ఇండ్ల పరిసరాల్లో ఉన్న వాడని పాత కూలర్లు. టైర్లు. కొబ్బరి చిప్పలు. రుబ్బురోలు. పగిలిన కుండలు తదితర వస్తువులలో నీరు నిలిచి ఉండడం వలన అక్కడ క్రిమి కీటకాలు ఏర్పడి అంటు వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉంటుందని సూచించారు. వీటివలన మలేరియా డెంగ్యూ లాంటి వ్యాధులు ప్రభలే ప్రమాదం ఉంటుందని దీనిని దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. బస్తీలలో పారిశుద్ధ సిబ్బంది మున్సిపల్ సిబ్బంది చేపట్టే స్వచ్ఛ కార్యక్రమాలకు ప్రజలు చేయూతనిచ్చి చేదోడుగా ఉండాలని సుమన్ రావు సూచించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ అనిల్. శానిటేషన్ ఇనిస్పెక్టర్ లక్ష్మయ్య. దుర్గా. తదితరులు పాల్గొన్నారు.





# ఫలహార బండి ఊరేగింపులో పాల్గొన్న మూసాపేట్ డివిజన్ మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్ కుమార్

కూకట్‌పల్లి, జూలై 26 (ప్రభాత ఉదయం) బోనాల పండుగ సందర్భంగా కూకట్ పల్లి దేవీ నగర్ లో శివాజీ యూత్ అసోసియేషన్, అభిలాష్ గౌడ్ మిత్రమండలి ఆహ్వానం మేరకు వారి ఆధ్వర్యంలోని ఫలహారం బండి ఊరేగింపు కార్యక్రమంలో మూసాపేట్ మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్ కుమార్ పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో అరుణ్, అక్షయ్, ప్రశాంత్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# మల్కాజ్గిరి మున్సిపల్ పరిధిలోని తక్షణ ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలి

## బీసీ కులాల ఐక్య వేదిక అధ్యక్షులు, కామల్ల ఐలన్న డిమాండ్

మల్కాజిగిరి, జూలై26 (ప్రభాత ఉదయం): బీసీ కులాల ఐక్య వేదిక మల్కాజ్గిరి నియోజకవర్గం అధ్యక్షులు కామల్ల ఐలన్న కమిటీ ఆధ్వర్యంలో తక్షణమే స్థానిక మౌలిక సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తు బీసీ కుల వర్గాలు, స్థానికులు కలిసి పార్టీలకు అతీతంగా మల్కాజ్ గిరి,మున్సిపల్ కార్యాలయం ముందు పెద్ద ఎత్తున ధర్నా చేపట్టారు. ఈధర్నాకు బీసీ కులాల ఐక్య వేదిక ఉపాధ్యక్షులు బత్తిని నర్సింహా గౌడ్ అధ్యక్షత వహించారు, ఈ ధర్నాలో ముఖ్య అతిధిగా హాజరైన కామల్ల ఐలన్న ప్రసంగిస్తు, వర్షాకాల సీజన్ లో వర్షాల కారణంగా ప్రజలు దోమ కాటుకు బలై తీవ్రమైన చలి జ్వరాలకు లోనై మలేరియా, టైపాయిడ్, డెంగ్యూ, ఇతర వ్యాధులకు సతమత మవుతు బలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేసారు, వెంటనే మున్సిపల్ అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని, దోమ నివారణకు బ్లీచింగ్ పౌడర్ ను చల్లాలని, %స్త్ర%గల్లీ గల్లికి వారానికి 3 సార్లు ఫాగింగ్ చేయించడం వల్ల దోమల నివారణ జరుగుతుందని , మల్కాజ్గిరి మున్సిపల్ పరిధిలో పగలు, రాత్రి అని తేడా లేకుండా వీధి కుక్కల బెడదా తీవ్రంగా ఉందని రాత్రి వేల వృద్ధులు, మహిళలు, పిల్లలు కుక్కల భయానికి రాత్రి వేళలల్ల తిరగ లేక పోతున్నారని నివారణ చర్యలు చేపట్టాలని కోరారు, వర్షా కాలంలో వర్షాల వల్ల రోడ్లు గుంతల మయం అయ్యి పాదాచారులకు, వాహన దారులకు అనారోగ్యంతో పాటు మ్యాన్ హౌల్ కవర్ లను సరి చేసి గుంతలు పూడ్చి ప్రజలకు రక్షణ కల్పించాలని కోరారు, బస్తి దవాఖానలు ఉన్న చోట ఉద్యోగులు సకాలంలో చేరుకొని రోగులకు మందులు, సరియైన చికిత్స అందించాలని కోరారు ప్రజలకు తెలిసే విదంగా , హాస్పిటల్ రూట్ అడ్రస్ బోర్డులు ఏర్పాటు చేయాలనీ కోరారు, ఈ సమస్యలను పరిష్కరించాలని కోరుతు మల్కాజ్గిరి మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ జి.రాజు గారికి వినతి పత్రం అందజేయడం జరిగింది, మీరు అందజేసిన వినతి పత్రం లోని సమస్యల పరిస్కారం కోసం కృషి చేస్తామని హామీ ఇచ్చారు, ఈ కార్యక్రములో పాల్గొన్న బీసీ కులాల నాయకులు ప్రధాన కార్యదర్శి రొయ్యల కృష్ణమూర్తి, పద్మశాలి నేత పిట్టల శ్రీనివాస్, గద్వాల వంశీ ముదిరాజ్, వాసగోని శ్రీనివాస్ గౌడ్, ఉపాధ్యక్షులు జినుకుంట్ల రమేష్ గౌడ్, బత్తిని నర్సింహా గౌడ్, కార్యదర్సులు కాసర్ల నాగరాజు, చేగూరి రామ్ మోహన్ కురుమ, ఉడుత నవీన్ నేత, చెరుకు సాంబరాజు ముదిరాజ్, పిట్టల భాస్కర్ నేత, సి.ఎచ్ సుధాకర్, శ్రీమతి కె.జయలక్ష్మి, బండ లక్ష్మి నారాయణ, జే.పర్వతాలు, బొల్లు సంపత్ ముదిరాజ్, దశరథ్ నేత, కటికల బిక్షపతి ముదిరాజ్, సాయి కుమార్, మేడ్చల్ జిల్లా వికలాంగుల అధ్యక్షులు వినయ్, వినయ్ ఆర్.సత్యనారాయణ రజక, జి.పాండు రజక, కె. శంకర్, దాస్, టి.రాములు జైరామ్, మల్లేష్, నాగరాజు గౌడ్ సత్యనారాయణ గౌడ్, బండి రమేష్ ముదిరాజ్, ఎం.బిక్షపతి యాదవ్, టి.లక్ష్మణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు,





కొత్తకోట పట్టణ బిజెపి సమావేశంలో మాట్లాడుతున్న దేవరకద్ర నియోజకవర్గం బిజెపి ఇంచార్జ్ కొండా ప్రశాంత్ రెడ్డి

# రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా శ్రేణులు పని చేయాలి

## దేవరకద్ర నియోజకవర్గం బిజెపి ఇన్చార్జి కొండా ప్రశాంత్ రెడ్డి

కొత్తకోట, జూలై 26(ప్రభాత ఉదయం) రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బిజెపి అభ్యర్థులను గెలిపించి క్షేత్రస్థాయిలో వాటిని బలోపేతం చేయడానికి పార్టీ శ్రేణుల శక్తి వంచన లేకుండా కృషి చేయాల్సిన అవసరం ఉందని దేవరకద్ర నియోజకవర్గం బిజెపి ఇన్చార్జి కొండా ప్రశాంత్ రెడ్డి శుక్రవారం కొత్తకోట పట్టణ కేంద్రంలో పట్టణ బిజెపి అధ్యక్షుడు నవీన్ రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యవర్గ సమావేశంలో దేవరకద్ర నియోజకవర్గ బిజెపి ఇంచార్జ్ కొండ ప్రశాంత్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సబ్బి రెడ్డి వెంకట్ రెడ్డి లు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెంకట్ రెడ్డి, ప్రశాంత రెడ్డిలు మాట్లాడుతూ... ప్రతి గ్రామంలో కార్యకర్తలు ప్రజలతో మమేకమై రాబోయే స్థానిక సంస్థ ఎన్నికల్లో తమ సత్తా చాటాలని కోరారు. కొండ ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ... ఎన్నికల అనగానే ప్రధానంగా డబ్బు అనే మాట వినిపిస్తుంది. కానీ యువకులు తలుచుకుంటే డబ్బు అనేది ఒక వంతు మాత్రమే పనిచేస్తుంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో యువకులు,కార్యకర్తలు ప్రతి ఒక్కరు తమ బాధ్యతను నిర్వహించాలని కోరారు.ఈ కార్యక్రమంలో బిజెపి పట్టణ అధ్యక్షుడు నవీన్ రెడ్డి,ప్రధాన కార్యదర్శి రాఘవేందర్ రెడ్డి, వనపర్తి జిల్లా మాజీ అధ్యక్షుడు రాజ వర్ధన్ రెడ్డి, అసెంబ్లీ కో కన్వీనర్ భరత్ భూషణ్, శ్రీనివాస్ రెడ్డి,నరేందర్, యువ మోర్చా అధ్యక్షులు మహేష్, బాలు,అశోక్, శ్రీకాంత్ రెడ్డి ముఖ్య నాయకులు బిజెపి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కాపుగడ్డ బోనాలు ఘటాల ఊరేగింపులో పాల్గొన్న విశ్వేశ్వర్ రెడ్డి. తోకల శ్రీనివాస్ రెడ్డి

శంషాబాద్. జూలై 26( ప్రభాత ఉదయం. శంషాబాద్ పురపాలక సంఘం పరిధిలోని కాపుగడ లో బిజెపి యువ నాయకుడు దమ్మాయిగూడ వీరేందర్ రెడ్డి నిర్వహించిన తోట్టేల ఘటాల ఉరేగింపు లో చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి. రాజేంద్రనగర్ కాంటెస్ట్ ఎమ్మెల్యే మైలార్ దేవుపల్లి కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. తెలంగాణ సంప్రదాయం ప్రకారం నిర్వహించే ఈ వేడుకలను ప్రతి ఇంటిలో జరుపుకోవాలని సంతోషకరమైన విషయమని ఆయన పేర్కొన్నారు. బస్సులో జరిగిన ఊరేగింపులో ఆయన పాల్గొని అందరికీ బోనాల పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు. డాక్టర్, ప్రేమ్ రాజ్ , జిల్లా బిజెపి అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి , మున్సిపల్ అధ్యక్షుడు దేవేందర్ , కొలను జగ్గీవన్ రెడ్డి ,బాత్కు



శ్రీనివాస్ యాదవ్ , కొలను ప్రదీప్ రెడ్డి ,నర్సింగ్ రావు ,వంశీ , గాజుల రాహుల్ , అశ్విని ,రాజ్ షేకర్ కాంగ్రెస్



నాయకుడు దమ్మాయిగూడ సంతోష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: KOTLA CHANDRA KANTH. "RNI. Title- Code: TELTEL12231**. Cell: 9705231654.